ప్రజల మధ్యే ఉంటా..
సమస్యలన్నీ పరిష్కరిస్తా


అధికారులకు సూచనలు చేస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

సనత్‌నగర్: నిరంతరం ప్రజల మధ్యే ఉంటూ వారి సమస్యలన్నీ పరిష్కరిస్తానని మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. బేగంపేట డివిజన్ మోతీలాల్ నెహ్రూనగర్‌లో వివిధ శాఖల అధికారులతో కలిసి బుధవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రధానంగా మెయిన్‌రోడ్డు నుంచి కాలనీలోకి వెళ్లే రోడ్డులో పలువురు రోడ్డును ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారని ఎమ్మెల్యేకు వివరించారు. అదే విధంగా వ్యాపారులు రోడ్లపై వాహనాలను నిలుపుతున్న కారణంగా తాము రాకపోకలు సాగించాలంటే తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామన్నారు. వెంటనే ఆక్రమణలు తొలగించాలని టౌన్‌ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. కాలనీలో రోడ్లపై అక్రమంగా నిలుపుదల చేస్తున్న ఇతర ప్రాంతాలకు చెందిన వారి వాహనాలను కూడా తరలించేలా చర్యలు తీసుకోవాలని ట్రాఫిక్ పోలీసులను ఆదేశించారు. అనంతరం కాలనీలోని పార్కును సందర్శించి పరిశీలించారు. పార్కులో కాలనీవాసుల సౌకర్యార్థం ఒక స్టోర్‌రూమ్ నిర్మాణానికి, నూతన పాత్‌వేల నిర్మాణం, గ్రీనరీ పెంపుదల, ఇతర సౌకర్యాల కల్పన కోసం వెంటనే ప్రతిపాదనలను సిద్ధం చేయాలని హార్టికల్చర్ అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట కార్పొరేటర్ మహేశ్వరిశ్రీహరి, వాటర్‌వర్క్స్ సీజీఎం ప్రభు, డీజీఎం శశాంక్, జీహెచ్‌ఎంసీ డీఈ సంతోష్, హార్టికల్చర్ అధికారి జోయబ్, మోతీలాల్ నెహ్రూనగర్ అధ్యక్ష, కార్యదర్శులు గౌర శ్రీనివాస్, విశాల్ సూదం, శ్రీశైలం, బీఆర్‌ఎస్ నాయకులు శ్రీహరి, శ్రీనివాస్‌గౌడ్, శేఖర్, మొహిన్, అజ్మత్, కిషోర్ పాల్గొన్నారు.

పరామర్శ


ఇంటిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

బన్సీలాల్‌పేట్: రాంగోపాల్‌పేట్ డివిజన్ వెంగళరావునగర్ బస్తీకి చెందిన ఝాన్సీ ఈ నెల 15న వంట చేస్తుండగా ప్రమాదవశాత్తు కుక్కర్ పేలడంతో ఇంటి పైకప్పు కొంతమేర ధ్వంసమైంది. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ బుధవారం వెంగళరావునగర్ బాధిత మహిళను పరామర్శించి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. బాధిత కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. మాజీ కార్పొరేటర్ అత్తెల్లి అరుణగౌడ్, బీఆర్‌ఎస్ నాయకులు అత్తెల్లి శ్రీనివాస్ గౌడ్, కిషోర్, మల్లేష్, కస్తూరి, రాజు, సాయినాథ్, గణేష్, సతీష్ బాధితురాలిని పరామర్శించారు.

అవకాశమిస్తే మల్కాజ్‌గిరి నుంచి పోటీ చేస్తా


మాట్లాడుతున్న మల్క కొమురయ్య

కంటోన్మెంట్: అవకాశం వస్తే బీజేపీ నుంచి మల్కాజ్‌గిరి ఎంపీగా పోటీ చేస్తానని పల్లవి, డీపీఎస్ విద్యాసంస్థల అధినేత మల్క కొమురయ్య ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తన కుటుంబ సభ్యులకు జనసంఘ్, ఆర్‌ఎస్‌ఎస్ వంటి సంస్థలతో అనుబంధం మేరకు సహజంగానే తాను హిందూ ధార్మిక కార్యక్రమాల్లో విరివిగా పాల్గొంటున్నట్లు తెలిపారు. బీజేపీలోని పలువురు సీనియర్‌ల సూచన మేరకు తాను ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావాలి అనుకుంటున్న అన్నారు. అయితే అభ్యర్థి ఎంపిక విషయంలో పార్టీ నిర్ణయానికి కట్టుబడి వేరొకరికి సీటు ఇచ్చినా తాను బీజేపీ గెలుపు కోసం సంపూర్ణంగా పని చేస్తా అన్నారు.

వైద్యులు అందుబాటులో ఉండాలి


ఆరోగ్య కేంద్రం వద్ద ఎమ్మెల్యే లాస్య

రసూల్‌పురా: పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు కంటోన్మెంట్ ఎమ్మెల్యే జి. లాస్యనందిత పేర్కొన్నారు. బుధవారం ఏడో వార్డు తిరుమలగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె సందర్శించి ఆరోగ్య సేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వైద్యులు ప్రజలకు అందుబాటులోఉండాలన్నారు. అనంతరం ఆరోగ్య కేంద్రం ముందు నిర్మించే షెడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. ఎమ్మెల్యే వెంట డీఎంహెచ్‌వో రాజకుమారి మాజీ బోర్డు సభ్యులు శ్యాంకుమార్, నాయకులు నివేదిత, తేజ్‌పాల్, కేబీ, శంకర్రావు, శత్రుఘ్న, మధు, వేణు, యశ్వంత్, కుర్మయ్య, మార్టిన్, రాజిరెడ్డి ఉన్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

సికింద్రాబాద్: రైలు ఢీకొట్టి ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. సికింద్రాబాద్ రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. బుధవారం ఉదయం సుమారు 40 ఏళ్ల వయసున్న ఓ వ్యక్తి రైల్వే అప్‌లైన్ మార్గంలో పట్టాలు దాటేందుకు యతిస్తుండగా వేగంగా వచ్చిన రైలు ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాల సేకరించేందుకు యత్నించగా ఎలాంటి ఆధారాలు లభించలేదు. మృతుడి ఒంటిపై తెల్లని టీషర్టు, నలుపు రంగు ప్యాంటు, మెడలో ఎర్రనిదారం, చేతిపై హనుమాన్ విగ్రహం ట్యాటూ వేసి ఉందని, మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 87126 58518/516 నంబర్‌లకు సమాచారం ఇవ్వాలన్నారు.

మతోన్మాద శక్తులను అరికట్టాలి

లిబర్టీ: విశ్వవిద్యాలయాల్లో దళిత విద్యార్థులపై జరుగుతున్న దాడులు, వేధింపులను అరికట్టాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు పబ్బతి శ్రీకృష్ణ డిమాండ్ చేశారు. వేధింపులు భరించలేక సెంట్రల్ యూనివర్సిటీలో పరిశోధన విద్యార్థి రోహిత్ వేముల ఆత్మహత్య చేసుకున్నారని గుర్తుచేస్తూ... ఆత్మహత్యకు బాధ్యులైన వారిని ఇంత వరకు కూడా శిక్షించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సెంట్రల్ యూనివర్సిటీ పరిశోధన విద్యార్థి రోహిత్ వేముల వర్ధంతి సభ బుధవారం మాల మహానాడు కార్యాలయంలో జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ... 2015 సంవత్సరంలో అగ్రకుల మతోన్మాద శక్తుల వేధింపుల కారణంగానే ఆత్మహత్య చేసుకున్నారని ఆరోపించారు. రోహిత్ వేముల పరిశోధన విద్యార్థిగా యూనివర్సిటీలో చురుకైన పాత్ర పోషించే వారని అది జీర్ణించుకోలేని మత శక్తులు వేధింపుల వల్ల వల్లనే నిండు జీవితాన్ని కోల్పోవాల్సి వచ్చిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బస్సులకు బారులు!

- సికింద్రాబాద్‌లో ప్రయాణికుల పాట్లు
- దొరకని ప్రీ పెయిడ్ ఆటోలు
- దండుకుంటున్న ప్రైవేటు వాహనదారులు


రైల్వేస్టేషన్ ఎదుట ప్రైవేటు వాహనాల కోసం వెళ్తున్న ప్రయాణికులు

సికింద్రాబాద్: సంక్రాంతి సెలవులు ముగిసిన నేపథ్యంలో ఊర్లకు వెళ్లిన వారంతా తిరిగి నగరానికి చేరుకుంటున్నారు. పొరుగు రాష్ట్రాలు, వివిధ జిల్లాల నుంచి వేలాది మంది ప్రయాణికులు నగరానికి చేరుకుంటున్న నేపథ్యంలో సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ పరిసరాల్లో రద్దీ మూడింతలు పెరిగింది. ఇక్కడికి చేరుకుంటున్న ప్రయాణికులు నగరంలోని వివిధ ప్రాంతాలకు వెళ్లేందుకు గత రెండ్రోజులుగా నానా ఇక్కట్లకు గురవుతున్నా సిటీ బస్సుల సంఖ్య మాత్రం పెరగడం లేదు. పండగ నేపథ్యంలో పలు డిపోలకు చెందిన సిటీ బస్సులను జిల్లాలకు తరలిస్తున్నారు. దీంతో సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు రోజువారీగా రాకపోకలు సాగించే బస్సుల సంఖ్య తగ్గింది. రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాల్లోని ఉప్పల్, మౌలాలి బస్టాపులు, రేతీఫైల్ బస్‌స్టేషన్ ప్రాంతాల్లో సిటీ బస్సుల కోసం ప్రయాణికులు పడిగాపులు కాస్తున్నారు. ముఖ్యంగా కూకట్‌పల్లి, పటాన్ చెరు, మేడ్చల్, జీడిమెట్ల, ఉప్పల్, అల్వాల్ రూట్లలో సిటీ బస్సుల్లో ప్రయాణిస్తున్న వారు నానా ఇబ్బందులు పడుతూ తమ తమ గమ్యస్థానాలకు చేరుకుంటున్నారు.

వృద్ధులు చిన్నారులకు ఇక్కట్లు..

ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణాలు ఉన్నప్పటికీ వాటిని అందుకోవడం కోసం మహిళలు కుస్తీలు పట్టాల్సి వస్తుంది. అసలే బస్సులు సరిపడా లేకపోవడం, పండగ సెలవుల రద్దీ విపరీతంగా ఉంటుండడంతో బస్సుల సంఖ్య పెరగకపోవడం, మహిళల సంఖ్య ఇటీవల రెట్టింపు కావడంతో సమస్యలు కూడా పెరుగుతున్నాయి. బస్సులు నిలుపకముందే మహిళలు పరుగులు తీస్తుండడం, తోపులాడుతూ బస్సుల్లోకి ఎక్కడం ప్రమాదాలకు దారి తీస్తోంది. చిన్నపిల్లలతో వచ్చే మహిళలు, వృద్ధులు బస్ ఎక్కడం కోసం తీవ్ర అవస్థల పాలవుతున్నారు. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ ప్రాంతంలో నిర్ణీత స్థలాల్లో బస్టాపులు కేటాయించి వదిలేయడం మినహా ప్రత్యేకంగా బస్‌షెల్టర్లు లేవు. దీంతో సిటీబస్సుల డ్రైవర్లు ఇష్టారాజ్యంగా బస్సులు నిలుపుతుండటంతో సమస్యల మరింత జఠిలంగా మారుతోంది.

అస్తవ్యస్తంగా ప్రీ పెయిడ్

ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానానికి చేర్చడం, బేరసారాలకు తావు లేకుండా ముందే నిర్ణీత ఛార్జీలు ఖరారు చేసి ఏర్పాటు చేసిన ప్రీపెయిడ్ వ్యవస్థ సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులకు ఎంతో ఉపయుక్తంగా ఉండేది. ప్రారంభించిన తొలినాళ్లలో ప్రీ పెయిడ్ ఆటోలు, ట్యాక్సీలు ప్రయాణికులకు ఎంతో అందుబాటులో ఉండేవి. పండగలు, సెలవుల దినాల్లో సైతం సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ చేరుకున్న ప్రయాణికులు పెద్దగా ఇబ్బంది పడేవారు కాదు. నేరుగా ప్రీపెయిడ్ కౌంటర్‌కు వచ్చి వాహనం బుక్ చేసుకుని వెళ్లేవారు. క్రమేణా ప్రీ పెయిడ్ పరిస్థితి పూర్తిగా అస్తవ్యస్తంగా మారింది. ప్రీ పెయిడ్ ఆటోల కోసం ప్రయాణికులు పడరాని పాట్లు పడాల్సి వస్తుంది. రైలు దిగిన ప్రయాణికులు ప్రీపెయిడ్ కేంద్రాల వద్ద పడిగాపులు కాస్తున్నా ఆటోలు దొరకడం లేదు. సాధారణ రోజుల్లో 1500 వరకు, సెలవు దినాల్లో 2000 వరకు ఆటోలను ప్రీ పెయిడ్ స్టాండులో నిలిపే విధంగా ట్రాఫిక్ పోలీసులు చర్యలు అప్పట్లో తీసుకునేవారు. ప్రస్తుతం ఈ వ్యవస్థ మొత్తంగా లోపభూయిష్టంగా మారింది.

బహిరంగ దోపిడీ..

ప్రీ పెయిడ్ స్టాండ్ పరిసరాలు, బస్టాపుల్లో ప్రైవేటు వాహనాల సంచారంపై ఆంక్షలు ఉన్నాయి. ఆంక్షల నిబంధనలు మొత్తంగా పాటించని ప్రైవేటు వాహనదారులు స్టేషన్ ప్రాంగణంలోకి యథేచ్ఛగా దూసుకొస్తున్నారు. స్టేషన్ నుంచి బయటకు వస్తున్న ప్రయాణికులను అడ్డుకుని బేరసారాలకు దిగుతున్నారు. ఈ తతంగాన్ని నియంత్రించాల్సిన బాధ్యత ట్రాఫిక్ పోలీసులది. ఈ వ్యవహారాలను చూసీచూడనట్టు వ్యవహరిస్తున్న పోలీసులు నో ఎంట్రీ వాహనాలు, అక్రమ పార్కింగ్‌ల చలాన్లపైన్నే ఎక్కువ దృష్టి సారిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. గత్యంతరం లేని పరిస్థితుల్లో ప్రయాణికులు ప్రైవేటు ఆటోలను ఆశ్రయించి డిమాండ్ చేసినంత ఛార్జీలు చెల్లించి తమ గమ్యస్థానాలకు చేరుకుంటున్నారు.

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యేల పరామర్శ


మురళీధర్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న పద్మారావు గౌడ్


రవికుమార్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే తలసాని

బౌద్ధనగర్: ఇటీవల అనారోగ్యంతో బౌద్ధనగర్ ప్రాంతానికి చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు యంజాల మురళీధర్ మరణించారు. బుధవారం బాధిత కుటుంబాన్ని సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమ సహచరుడు మురళీధర్‌ను కోల్పోవడం బాధాకరం అన్నారు.

- అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బీఆర్‌ఎస్ యువ నేత సిలం సాయి యాదవ్‌ను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

రవికుమార్ మృతి బాధాకరం..

బన్సీలాల్‌పేట్: బన్సీలాల్‌పేట్ డివిజన్ గాంధీనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు రవికుమార్ మరణం బాధాకరమని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. గాంధీనగర్ కమ్యూనిటీహాల్‌లో బుధవారం ఏర్పాటు చేసిన రవికుమార్ దశదిన కర్మ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మంచికి మారుపేరుగా నిల్చి గాంధీనగర్ కాలనీ అభివృద్ధి, సంక్షేమ కోసం పరితపించిన రవికుమార్ మరణం తనను తీవ్రంగా కలిచివేసిందన్నారు. అనంతరం రవి కుమార్ కుటుంబీకులను ఎమ్మెల్యే పరామర్శించారు. ఈ కార్యక్రమంలో రవికాంత్, ప్రేమ్‌కుమార్, కుమార్ యాదవ్, రాజేందర్, చిన్నా, రమేష్ పాల్గొన్నారు.

ఇద్దరికి ఏడు రోజుల జైలుశిక్ష

పద్మారావునగర్: ఈ–పెట్టీ కేసుల్లో ఇద్దరు యువకులకు శిక్ష విధించిన ఘటన మోండా మార్కెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ వివరాల ప్రకారం.. ఈ–పెట్టీ కేసుల్లో కుమ్మరిగూడకు చెందిన మురళి (39), మహ్మద్ సోహెల్‌ఖాన్ (19) జైలు శిక్ష పడింది. పాత కక్షలతో మురళికృష్ణ తన బంధువుతో గొడవ పడి చేయిచేసుకుసుకోగా.. మహ్మద్ సోహెల్‌ఖాన్ రోడ్డుపై న్యూసెన్స్ చేస్తూ ప్రజలకు ఇబ్బంది కలిగించిన ఘటనల్లో పోలీసులు కేసు నమోదు చేశారు. ఇద్దరిని బుధవారం 13వ స్పెషల్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ ఎ. శారదదేవీ ముందు ప్రవేశపెట్టగా ఇరువురికి ఏడు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

కాంట్రాక్టు అధ్యాపకులకు హెల్త్ కార్డులు ఇవ్వాలి

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలోని వివిధ యూనివర్సిటీలలో పని చేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులకు హెల్త్‌కార్డులు ఇవ్వాలని ఓయూ అధ్యాపకులు విజ్ఞప్తి చేశారు. తక్కువ వేతనాలతో పని చేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులు అనారోగ్య కారణాలతో ఇబ్బందులు పడుతున్నారని ఆర్థిక ఇబ్బందులతో సరైన చికిత్స చేయించుకోలేక పోతున్నారన్నారు.

22న సెలవు ప్రకటించాలి

నల్లకుంట: ఉత్తర ప్రదేశ్‌లో ఈ నెల 22న అయోధ్య ఆలయ ప్రారంభం, బాలరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవాన్ని పురస్కరించుకొని ఆ రోజు సెలవు ప్రకటించాలని బీజేపీ ఎండోమెంట్ సెల్ కన్వీనర్ అన్నావజ్జుల సూర్య ప్రకాశ్ తెలంగాణ ప్రభుత్వాన్ని కోరారు. అయోధ్య రాముడి ప్రాణ ప్రతిష్ఠాపన నేత్ర పర్వంగా జరగనుండటం ద్వారా హిందువుల 500 ఏళ్ల ఆకాంక్ష నెరవేరబోతోందన్నారు. దీని కోసం కోట్లాది మంది హిందువులు ఎదురుచూస్తున్నారని ఆయన స్పష్టం చేశారు. అయోధ్య రామాలయం ప్రారంభోత్సవం రోజు ప్రపంచంలోని చాలా దేశాలు సెలవు ప్రకటించాయని తెలిపారు. ఇది ప్రపంచంలోని హిందువులందరి పండుగ అని, ఆ రోజు సెలవు ప్రకటించి హిందువుల మనోభావాలను గౌరవించాలన్నారు.





పార్కింగ్‌తో పరేషాన్!

- నిత్యం ట్రాఫిక్ జామ్
- రాకపోకలకు ఇబ్బందులు
- పట్టించుకోని ట్రాఫిక్, జీహెచ్‌ఎంసీ అధికారులు

లాలాపేట: ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగించేలా రోడ్లపై అక్రమ పార్కింగ్‌లు, ఫుట్‌పాత్ ఆక్రమణలపై ట్రాఫిక్ పోలీసులు, జీహెచ్‌ఎంసీ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ట్రాఫిక్ సమస్యకు కారణమవుతున్న వాహనాలు, వస్తువులను స్టేషన్‌లకు తరలించి వారిపై కేసులు నమోదు, జరిమానాలు విధిస్తున్నారు. ఇంత వరకు బాగానే ఉంది.కానీ పెయిడ్ పార్కింగ్‌ల పేరుతో నగరంలోని మెట్రో స్టేషన్ల వద్ద రోడ్లపైనే యథేచ్ఛగా వందల సంఖ్యలో వాహనాలను నిలిపి రాకపోకలకు అంతరాయం కలిగిస్తున్నారు. తార్నాక ప్రధాన రహదారిలో ఉదయం సాయంత్రం తీవ్రమైన ట్రాఫిక్ జామ్ నెలకొంటుంది. వీటికి తోడుగా అక్రమ పార్కింగ్‌లు ఒకవైపు, మెట్రో పెయిడ్ పార్కింగ్‌లు మరో వైపు బారులుతీరుతాయి. ఈ మార్గాల్లో నిత్యం ట్రాఫిక్ జామ్ సమస్య ఉత్పన్నమవుతున్నా పట్టించుకునే నాథులే లేరని వాహనదారులు వాపోతున్నారు.

వందల సంఖ్యల్లో వాహనాలు..

తార్నాక, హబ్సిగూడ మెట్రో స్టేషన్ల వద్ద రోడ్డుకు ఇరు వైపులా దాదాపు 500 మీటర్ల దూరం వరకు వందల సంఖ్యలో వాహనాలను పెయిడ్ పార్కింగ్‌కు అనుమతిస్తున్నారు. ఇదే అదనుగా భావించి హబ్సిగూడ వైపు ఉన్న కినారా గ్రాండ్, గుడ్ లాండ్, సుప్రభాత్ వంటి హోటళ్లు, ఫంక్షన్ హాల్‌కు వచ్చే కార్లు ఇటు తార్నాకలోని ప్రాచ్యలిఖిత గ్రంథాలయం వరకు అనధికారికంగా వాహనాలను పార్క్ చేస్తున్నారు. వీటితో తరచూ ఈ మార్గంలో ట్రాఫిక్ జామ్ ఏర్పడుతుంది. దీంతో పాటు తార్నాకలోని సుదర్శన్‌రెడ్డి స్వీట్ హౌజ్ వద్ద, అటు సీసీఎంబీ వద్ద ఉన్న యూటర్న్‌ల వద్ద వాహనాలు మలుపు తిరిగే క్రమంలో అక్రమ పార్కింగ్ వాహనాలు అడ్డుగా రావడంతో ప్రమాదాలు సైతం చోటు చేసుకుంటున్నాయి.

అక్రమ పార్కింగ్ చేసే ప్రాంతాలివే..

- లాలాపేట లేబర్ అడ్డాపై ఓ వాహనం నెలల తరబడి అక్కడే వదిలేసారు.
- సత్యానగర్‌కు వెళ్లే మార్గంలో ఇటీవల పక్కా రోడ్డు నిర్మాణం చేసిన దానిపై ఎప్పుడు చూసినా వాహనాల పార్కింగ్ కనిపిస్తోంది.
- లాలాపేట ఫ్లై ఓవర్ కింద అక్రమ పార్కింగ్, పాడైన వాహనాలకు అడ్డాగా మారింది.
- తార్నాక చింతల్ బస్తీలోని అంబేడ్కర్ విగ్రహం చుట్టూ ఇష్టానుసారంగా వాహనాలను పార్క్ చేస్తున్నారు.
- లాలాపేటలోని పట్టణ ఆరోగ్య కేంద్రం, పట్టణ సామాజిక ఆరోగ్య కేంద్రాలకు వెళ్లే మార్గంలో వాహనాల నిలిపివేతతో తరచూ అంబులెన్స్‌కు అంతరాయం తలెత్తుతోంది.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సనత్‌నగర్: అల్విన్, సంజీవయ్య పార్కు సబ్‌స్టేషన్ల పరిధిలోని విద్యుత్ ఫీడర్ లైన్ల మరమ్మతుల కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందని గ్రీన్‌ల్యాండ్స్ ఏడీఈ చరణ్‌సింగ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సౌభాగ్యనగర్, ఎస్‌ఆర్‌టీ క్వార్టర్స్, కైలాష్‌నగర్, సుభాష్‌నగర్, పాటిగడ్డ క్వార్టర్స్, నూర్‌బాగ్. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎర్రగడ్డ మెయిన్‌రోడ్డు, ఎఫ్‌సీఐ గోడౌన్ ఏరియా, పాటిగడ్డ రోడ్డు, నవాబ్ గల్లీ, పైగా ప్యాలెస్, రసూల్‌పురా సర్కిల్ ప్రాంతాల్లో విద్యుత్ కోత ఉంటుందన్నారు.

ఐబీసీటీ, వసంతపురి, అడ్డగుట్ట పరిధిలో..

ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు దాల్‌మిల్–1, గుడిమెల్ల విల్లా, నాగార్జున కమ్యూనిటీహాల్, అప్పారావు పేట్, వైశాలి అపార్ట్‌మెంట్, షిర్డి సాయినగర్, బ్యాంక్ ఆఫ్ బరోడా, స్ట్రీట్‌నెంబర్–1, సూర్యవంశీ అపార్ట్‌మెంట్, కిమ్‌టీ కాలనీ స్ట్రీట్‌నెంబర్–1, సుదర్శన్‌రెడ్డి స్వీట్ షాపు, చిల్డ్రన్ హాస్పటల్, సన్మాన్ హోటల్, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు శోభ కుమార అపార్ట్‌మెంట్ ఏరియా, ఆర్యన్‌నగర్, శాంతినగర్ బస్టాప్ ఏరియా, వాటర్‌ట్యాంక్ ఏరియా.

- మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 4.30 వరకు ఇందిరానగర్, లాలాపేట్ కమాన్, గణేష్ టెంపుల్, ఇసుకబాయి, ఎస్‌ఎఫ్‌ఎస్ స్కూల్ రోడ్డు, వడ్డెరబస్తీ, తుకారంగేట్, ఇందిరాగాంధీ విగ్రహం, గంగపుత్ర సంఘం, గండయ్య హాస్పటల్, సుభాష్ విగ్రహం, సాయిబాబా టెంపుల్, నేషనల్ సీడ్స్, లాలాగూడ రైల్వేస్టేషన్ ప్రాంతాల్లో విద్యుత్ కోత ఉంటుందని ఏడీఈ ఆదినారాయణరావు తెలిపారు.

22న హనుమాన్ దేవాలయంలో విశిష్ట పూజలు

సనత్‌నగర్: అయోధ్యలో శ్రీబాల రాముడి విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా సనత్‌నగర్‌లోని శ్రీహనుమాన్ దేవాలయంలో ఈ నెల 22న ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు భజన సంకీర్తన శ్రీరామ నామస్మరణ, మధ్యాహ్నం 12 నుంచి అయోధ్యలో జరిగే స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠ ప్రత్యక్ష ప్రసారాన్ని ఎల్‌ఈడీ స్క్రీన్ ద్వారా వీక్షించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. అనంతరం స్వామికి అర్చన, ప్రసాద సమర్పణ, హారతి, అయోధ్య శ్రీరామ అక్షింతలతో ఆశీర్వాద కార్యక్రమాలు జరగనున్నాయి. మధ్యాహ్నం ఒంటి గంట వరకు తృణధాన్యాలతో చేసిన అన్నప్రసాదం భక్తులకు అందించనున్నారు. సాయంత్రం 6 గంటలకు దీపోత్సవం, విష్ణు సహస్రనామ పారాయణం, హనుమాన్ చాలీసా పారాయణం ఉంటాయని నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు.

అక్రమ నిర్మాణాలపై కొరడా


శ్రీనివాసనగర్‌లో ..

చిలకలగూడ : సీతాఫల్‌మండి డివిజన్ శ్రీనివాసనగర్‌లో నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న పలు అక్రమ నిర్మాణాలను జీహెచ్‌ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు బుధవారం కూల్చివేశారు. శ్రీనివాసనగర్ ఐమాత ఆలయ సమీపంలో సెట్ బ్యాక్ లేకుండా, నిబంధనలు పాటించకుండా అక్రమ నిర్మాణాలు జరుగుతున్నట్లు ఫిర్యాదు అందుకున్న అధికారులు టౌన్ ప్లానింగ్ ఏసీపీ రజిత నేతృత్వంలో సెక్షన్ ఆఫీసర్ సరిత సిబ్బందితో కలిసి ఆయా ప్రాంతాల్లో పర్యటించి అక్రమ కట్టడాలను కూల్చివేయించారు. నిబంధనల ప్రకారం నిర్మాణాలు చేపట్టాలని లేకుంటే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. టౌన్ ప్లానింగ్ చైన్‌మెన్లు ఆంజనేయులు, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

తార్నాకలో..


అక్రమ నిర్మాణాన్ని కూల్చివేస్తున్న దృశ్యం

లాలాపేట: సికింద్రాబాద్ నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాల్లో బుధవారం జీహెచ్‌ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు అక్రమ నిర్మాణాలపై కొరడా ఝులిపించారు. తార్నాకలో ఓ భవనంపై నిబంధనలను అతిక్రమిస్తూ చేపట్టిన పెంట్ హౌజ్‌ను కూలివేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. నిబంధనలు ఉల్లంఘించి నిర్మాణాలు చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు

సచిన్‌కు అవకాశం కల్పించాలి

ఉస్మానియా యూనివర్సిటీ: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పెద్దపల్లి రిజర్వుడు స్థానాన్ని గోమాస సచిన్‌కు కేటాయించాలని ఎస్సీ యువశక్తి తెలంగాణ రాష్ట్ర కోఆర్డినేటర్ నిట్టురి రవిమాదిగ సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. ప్రజా సమస్యలపై నిత్యం స్పందిస్తూ అనేక సేవ కార్యక్రమాలతో ప్రజలతో మమేకమైన సచిన్ ప్రజల మన్ననలను పొందారన్నారు.

సౌజన్యకు జాతీయ యువజన అవార్డు

కాచిగూడ: స్వామి వివేకానంద జయంతి ఉత్సవాల నేపథ్యంలో నవభారతి నిర్మాణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతి ఏటా అందించే జాతీయ యువజన అవార్డు–2024కు సి.హెచ్.సౌజన్యను ఎంపిక చేసినట్లు ఆ సంస్థ అధ్యక్షుడు బత్తుల హేమంత్ తెలిపారు. ఎనమిదేళ్లుగా ఎన్‌సీసీ, వివిధ సంస్థల నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలలో పాల్గొంటూ శాంతి, మత సామరస్యం, పర్యావరణ పరిరక్షణ, జాతీయ సమైఖ్యత, విద్యార్థుల సంక్షేమ అభివృద్ధికి సౌజన్య అందిస్తున్న సేవలను గుర్తించి ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ నెల 19వ తేదీన బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్ అడిటోరియంలో నిర్వహించే కార్యక్రమంలో సౌజన్యకు జాతీయ యువజన అవార్డును అందజేయనున్నట్లు ఆయన తెలిపారు.

కేంద్రంలో మరోసారి అధికారం బీజేపీదే: గౌతంరావు

కాచిగూడ: ప్రతి ఇంటా జనవరి 22వ తేదీన దీపావళి పండగలా సంబరాలు జరుపుకోవాలని బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్.గౌతంరావు పిలుపునిచ్చారు. బర్కత్‌పురాలోని బీజేపీ నగర కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... అయోధ్యలో రామమందిర నిర్మాణం కోసం ఎంతోమంది త్యాగాలు చేశారన్నారు. అయోధ్యలో రామమందిరాన్ని నిర్మించడంతో హిందువుల కోరిక నెరవేరిందని గౌతమ్‌రావు పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపుమేరకు దేవాలయాలను శుభ్రం చేయాలని ఆయన కోరారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికలలో బీజేపీ మరోసారి కేంద్రంలో అధికారంలోకి రావడం ఖాయమని గౌతంరావు ధీమా వ్యక్తం చేశారు. శ్యామ్‌సుందర్ గౌడ్, నాగూరావు నమోజీ, చంద్రశేఖర్, కృష్ణగౌడ్, మేకల సారంగపాణి, పవన్ పాల్గొన్నారు.

అందరి సహకారంతో మల్లన్న జాతర విజయవంతం

ముషీరాబాద్: అందరి సహకారంతో శ్రీ భ్రమరాంబా మల్లికార్జున స్వామి (శ్రీ మల్లన్న) జాతర మహోత్సవం విజయవంతంగా ముగిసిందని ఆలయ కమిటీ మేనేజింగ్ ట్రస్టీ నల్లవెల్లి అంజిరెడ్డి తెలిపారు. వారం రోజుల పాటు అంగరంగ వైభవంగా నిర్వహించిన శ్రీ మల్లన్న జాతర మహోత్సవాలలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా విజయవంతం చేసినందుకు ఆలయ కమిటీ ట్రస్టీ అంజిరెడ్డిని బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, భక్తులు బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రతి సంవత్సరం స్వామి వారి ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తూ ప్రజలలో ఆధ్యాత్మిక భావం పెంపొందిస్తున్నట్లు తెలిపారు. వివిధ పార్టీల నాయకులు తుమ్మరాజు, గోక నవీన్, మురళీ, అరుణ్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సేవాభావాలను అలవర్చుకోవాలి

ముషీరాబాద్: ప్రతి ఒక్కరూ సేవా భావాలను అలవర్చుకొని ఆపదలో ఉన్న వారిని ఆదుకోవాలని బీజేవైఎం మహంకాళీ జిల్లా అధ్యక్షుడు మద్దురి శివాజీ అన్నారు. బుధవారం బీజేవైఎం అధికార ప్రతినిధి బుర్ర రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో ముషీరాబాద్‌లోని రెయిన్‌బో హోమ్ అనాథ ఆశ్రమంలో అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ముఖ్య అతిథిగా హాజరైన మద్దురి శివాజీ అనాథ పిల్లలతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. సామాజిక బాధ్యతతో అనాథ పిల్లలకు తమవంతు సహాయ సహకారం అందించి వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు శక్తిసింగ్, రాజునేత, అనిల్‌కుమార్, లడ్డూ, బాబీ తదితరులు పాల్గొన్నారు.